నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

నేడు ఎల్ఎండీ గేట్లు ఓపెన్

నిండుకుండలా ఎల్ఎండీ

తిమ్మాపూర్, సెప్టెంబర్15: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు కాళేశ్వరం జలాలతో ఎల్ఎండీ వారం రోజుల క్రితం నిండు కుండలా మారింది. 24.034 టీఎంసీల సామర్థ్యం గల లోయర్ మానేరు జలాశయంలో ప్రస్తుతం 23.947 టీఎంసీల స్టోరేజీతో పూర్తి స్థాయి నీటి మట్టం చేరుకున్నది. ఈ క్రమంలో ఎల్ఎండీ ఎగువన ఉన్న శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి ఇన్ ఫ్లో పెరుగుతున్న నేపథ్యంలో ఎల్ఎండీలోకి నీళ్లను వదిలే అవకాశం ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్ఎండీ నుంచి సోమవారం 3గేట్ల ద్వారా సుమారు 5వేల క్యూసెక్కుల నీటిని వదలనునట్టు ఎల్ఎండీ ఈఈ నాగభూషణ రావు తెలిపారు. గేట్ల ద్వారా నీళ్లను మానేరు వాగులోకి వదులుతున్న క్రమంలో నది పరీవాహక ప్రాంతాల్లో పశువులు, గొర్రెలు మేపేవారు, చేపలు పట్టేవారు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పరపతి.. అధోగతి

ప్రాథమిక సహకార పరపతి సంఘాలు కట్టుతప్పుతున్నాయి. రైతులకు అండగా నిలిచి పురోగమనంలో ముందుకు తీసుకువెళ్లాల్సిన సొసైటీల్లో అవినీతి మరకలు కనిపిస్తున్నాయి. నిధుల దుర్వినియోగం, రైతుల రుణమాఫీల్లో అవకతవకలు, రైతుల వివరాలు బ్యాంకులకు సమర్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుండగా, మరోవైపు వాటాధనాల విషయంలో అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఇటీవల జరిగిన పలు ఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. మల్యాలకు చెందిన రైతు రూ.లక్ష లోన్ తీసుకుంటే రూ.2లక్షల పైన నమోదై ఉండడం, జైనకు చెందిన మరొక రైతు గతంలో రుణమాఫీ జరిగి ఎన్వోసీ సైతం తీసుకున్న లోన్ కట్టలేదని రికార్డుల్లో ఉండడం అనుమానాలకు తావిస్తుండగా, రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

- ప్యాక్స్‌లకు అవినీతి చెదలు
- రైతు రుణమాఫీలో అవకతవకలు!
- తీసుకున్న రుణం మొత్తం కంటే ఎక్కువ నమోదు?
- రుణమాఫీ జరుగక రైతుల ఆందోళన
- సిబ్బంది తీరుపై మండిపాటు

కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు కాపీ


జనగాం రాములు (బాధిత రైతు)

లోన్ ₹లక్ష.. బ్యాంకులో నమోదైంది ₹2 లక్షలు

.. పై చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు జనగాం రాములు. మల్యాలకు చెందిన ఇతనికి గ్రామంలో మూడెకరాల భూమి ఉంది. పెట్టుబడి కోసం మల్యాల కేడీసీసీ కో ఆపరేటివ్ బ్యాంకుల గతేడాది సెప్టెంబర్ 23న ₹లక్ష రుణం తీసుకున్నడు. ఈ క్రమంలో బ్యాంకు అధికారులు లోన్‌లో ₹10 వేలు వాటాధనంగా మినహాయించుకొని ₹90 వేలు ఖాతాలో జమ చేశారు. కాంగ్రెస్ సర్కారు జూన్‌లో రుణమాఫీ చేస్తామని చెప్పడంతో సంబురపడ్డాడు. మొదటి జాబితాలనే మాఫీ అవుతుందని భావించగా, మూడు విడతలు పూర్తయినా మాఫీ కాలేదు. దీంతో రాములు బ్యాంకుకు వెళ్లి వివరాలు అడిగితే అతని పేరు మీద ₹2,02,723 లక్షల అప్పు నమోదై ఉందని చెప్పడంతో కంగుతిన్నాడు. ₹లక్ష లోన్ తీసుకుంటే ₹2లక్షల మీద ఎట్ల చూపిస్తదని బ్యాంకు అధికారులను అడిగితే సాంకేతిక లోపంతో తప్పుగా నమోదైందని సమాధానం ఇచ్చారు. అధికారులు చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందని రాములు గత నెల 28న పూర్తి వివరాలు, తన బ్యాంకు స్టేట్‌మెంట్లతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 'సాంకేతిక నైపుణ్యంతో పొరబాటు జరిగినట్టు నేను భావించడం లేదు. కావాలని ఎవరో వ్యక్తులు నా పేరుపై అదనంగా ₹లక్ష రుణం తీసుకొని వినియోగించుకున్నారని అనిపిస్తుంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలి' అని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కాగా, ఈ విషయమై మల్యాల కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా, సాంకేతిక కారణాలతో జనగాం రాములుకు రుణమాఫీ కాలేదని, ఫిర్యాదు విషయమై జిల్లా ఇంటలెక్టో కమిటీకి రాతపూర్వకంగా నివేదిక ఇచ్చామని, రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.

జగిత్యాల, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 52 సంఘాలు, 17 కేడీసీసీ బ్యాంకు శాఖలు ఉన్నాయి. వీటి పరిధిలో వేలాది మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరు వందల కోట్ల రుణం పొందారు. ఈ సంఘాల ద్వారా రైతులకు, రైతు ఉత్పత్తులకు సేవలందిస్తున్నారు. మొత్తంగా 270కి పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి సీజన్‌లో ధాన్యం సేకరిస్తున్నారు. ఒకానొక దశలో 3లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోళ్లు జరిపి ₹671 కోట్ల చెల్లింపులు జరిపిన చరిత్ర సంఘాలకు ఉన్నది. అయితే, ఇటీవలి కాలంలో వరుసగా సింగిల్ విండోలపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింగిల్ విండోల్లో వాటాధనం చెల్లింపుల విషయంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘంలో సభ్యుడైన రైతు పంట రుణం తీసుకునే సమయంలో రుణ మొత్తంలో పదిశాతాన్ని వాటాధనంగా చెల్లిస్తున్నారు. ఇది సభ్యుడి పేరుపైనే ఉంటుంది. ఒకసారి వాటాధనం చెల్లించిన రైతు మరోసారి చెల్లించాల్సిన అవసరం లేదు. గతంలో తీసుకున్న రుణం కంటే ఎక్కువగా తీసుకుంటే, అదనంగా తీసుకుంటున్న మొత్తంలో పదిశాతాన్ని వాటాధనంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఇందులో పెద్ద స్కామ్ ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీ అంశాన్ని ఆసరాగా చేసుకొని వాటాధనం చెల్లింపులో సిబ్బంది తమ చేతివాటం చూపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు ఒక సభ్యుడు ₹లక్ష రుణం తీసుకుంటే, ఆయన వద్ద నుంచి ₹10వేలు వాటాధనంగా తీసుకొని, ₹90 వేలు రైతుకు అందజేస్తున్నారు. 2014లో స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ₹లక్ష లోపు రైతులు తీసుకున్న రుణాన్ని మాఫీ చేసిన విషయం తెలిసిందే. అంటే కేసీఆర్ రైతు తీసుకున్న మూలధనం వాటాతో సహా చెల్లించి వేశాడు. ఈ లెక్కన ఒక్కసారి రుణం తీసుకున్న రైతుకు సంబంధించిన మూలధనం వాటా పరపతి సంఘం వద్ద ఉన్నట్టే లెక్క. రైతు రుణమాఫీ జరిగిన తర్వాత మరోసారి ₹లక్ష రుణం తీసుకుంటే పదిశాతం వాటాధనం చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ, చాలా సింగిల్ విండోలు రైతుల వద్ద నుంచి రెండోసారి, మూడోసారి రుణాలు తీసుకున్న సందర్భంలో వాటాధనంగా పదిశాతం డబ్బును మినహాయించుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మెజార్టీ సంఘాల్లో ఈ తతంగం జరిగిందని చెబుతున్నారు.

రుణమాఫీ జాబితాలో నిర్లక్ష్యం

రైతు రుణమాఫీ జాబితాల విషయంలోనూ సింగిల్ విండోలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ పరిధిలో రుణాలు తీసుకున్న రైతుల వివరాలను బ్యాంకులకు అందజేయడంలో సింగిల్ విండోలు, కేడీసీసీ బ్యాంకు శాఖలు నిర్లక్ష్యం చేశాయని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 సింగిల్ విండోలున్నాయని, ఏ సింగిల్ విండో పరిధిలోనూ వందశాతం రుణమాఫీ జరగలేదని చెబుతున్నారు. వంద శాతం కాదు కదా! కనీసం 50 శాతం సైతం రుణమాఫీ జరగలేదని పేర్కొంటున్నారు. మాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనతో వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులను కలిస్తే తమకు వచ్చిన జాబితాల ప్రకారం పంపించామని, సింగిల్ విండోల నుంచి జాబితాలు పూర్తిస్థాయిలో రాలేదంటున్నారు. పరపతి సంఘాల నుంచి బ్యాంకర్లకు, వ్యవసాయ శాఖ అధికారులకు పంపించిన రైతు రుణ జాబితాల్లో చాలా తప్పులు దొర్లినట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కొన్ని కేసుల్లో రైతులకు రుణమాఫీ కాకపోవడానికి పరపతి సంఘాల నిర్లక్ష్యం సైతం కారణమంటున్నారు. రైతులు ప్రతి ఏడాది రుణాన్ని రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నారని, రెన్యువల్ అయిన తేదీనే రుణం తీసుకున్న తేదీగా చూపించాల్సి ఉంటుంది. కానీ విండోలు అలా చూపించక రైతు మొదట అప్పు తీసుకున్న తేదీని చూపించడంతో ప్రభుత్వం పెట్టిన కటాఫ్ డేట్ పరిధిలోకి రాకుండా పోయారని, దీంతో రుణమాఫీకి నోచుకోలేదని రైతులు వాపోతున్నారు. అలాగే రైతుల ఆధార్‌కార్డులను, పాస్‌పుస్తకాలను వారి ఖాతాలతో జతపర్చే విషయంలోను నిర్లక్ష్యం జరిగిందని, చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదంటున్నారు. ధర్మపురి జైన సింగిల్ విండో పరిధిలోనే 18 మంది రైతుల ఆధార్‌కార్డు నమోదులో తప్పిదాలు జరిగాయని, వారందరూ రుణమాఫీకి నోచుకోలేదని రైతులు చెబుతున్నారు.

డబ్బు కట్టినా.. కట్టలేదంటూ రికార్డులు

ధర్మపురి మండలం జైనకు చెందిన కొస్న రాంరెడ్డి అనే రైతుది మరో వ్యథ. రాంరెడ్డికి గ్రామంలో 4.30 ఎకరాల భూమి ఉండగా, జైన సింగిల్ విండోలో 2017లో ₹60వేలు లోన్ తీసుకున్నాడు. రాంరెడ్డి తండ్రి నారాయణరెడ్డి సైతం తన భూమిపై ₹50వేల అప్పు తీసుకున్నాడు. అయితే, అంతలోనే నారాయణరెడ్డి చనిపోవడంతో ఆయన పేరిట ఉన్న ₹50వేల అప్పును రాంరెడ్డి, ఆయన సోదరుడికి రెండు భాగాలుగా అధికారులు పంపిణీ చేశారు. కేసీఆర్ హయాంలో రాంరెడ్డి తీసుకున్న ₹60వేలు, తండ్రి మరణాంతరం వచ్చిన ₹25వేల అప్పు వడ్డీతో కలిపి ₹87వేలు మాఫీ అయ్యాయి. గతేడాది రాంరెడ్డి సింగిల్ విండోకు వెళ్లి ₹1.50 లక్షల పంట రుణం ఇవ్వాలని అడుగగా, సింగిల్ విండో అధికారులు ఇవ్వకపోవడంతో ధర్మపురిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును సంప్రదించాడు. పంట రుణం ఇస్తామని, అయితే ఇతర బ్యాంకుల్లో లోన్ తీసుకోలేదని, అప్పు లేదనట్టు నో డ్యూ సర్టిఫికెట్ తేవాలని సూచించడంతో జైన సింగిల్ విండో నుంచి బాకీ లేనట్టు నో డ్యూ సర్టిఫికెట్‌ను తీసుకున్నాడు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో సమర్పించగా, బ్యాంకు అధికారులు గతేడాది సెప్టెంబర్ 8న రాంరెడ్డికి ₹1.50లక్షల లోన్ ఇచ్చారు. అయితే, ఇటీవల జరిగిన రుణమాఫీ జాబితాలో రాంరెడ్డి పేరు లేదు. ఆశ్చర్యపోయిన రాంరెడ్డి అధికారులను సంప్రదించగా, 'నీవు రెండు చోట్ల లోన్ తీసుకున్నవ్. నీకు మొత్తం రెండు లక్షలకు పైగా రుణం ఉంది' అని చెప్పడంతో రాంరెడ్డి నిర్ఘాంతపోయాడు. వెంటనే జైన సింగిల్ విండోకు వెళ్లి పరిశీలించగా, ₹87వేలు అప్పు ఉన్నట్టు రికార్డుల్లో నమోదై ఉంది. ఎప్పుడో 2018లో మాఫీ అయిన రుణం, నో డ్యూ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత సైతం ఎలా కనిపిస్తుందో అర్థం కావడం లేదంటూ రాంరెడ్డి వాపోతున్నాడు. కాగా, ఈ విషయమై జైన పరపతి సంఘం సీఈవోను సంప్రదించగా, గ్రామంలో కొస్న రాంరెడ్డి సన్నాఫ్ నారాయణరెడ్డి ఇద్దరు ఉన్నారని, పొరపాటున ఒకరి రుణం ఒకరి పేరుపై నమోదు కావడంతో రుణమాఫీ జరుగలేదని వివరణ ఇచ్చారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

- మానకొండూర్‌లో మంత్రి పొన్నం, చింతకుంటలో ఎమ్మెల్యే గంగుల ఏర్పాట్ల పరిశీలన
- వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచన

చింతకుంట కెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్

మానకొండూర్/ కొత్తపల్లి, సెప్టెంబర్ 15 : వినాయక నిమజ్జనోత్సవాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు అధికారులు విగ్రహాల నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు భారీ క్రేన్లను అందుబాటులో ఉంచారు. భక్తులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, శోభాయాత్ర సాగే ప్రాంతాల్లో సమస్యలు రాకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా, కరీంనగర్ జిల్లా మానకొండూర్ చెరువు వద్ద ఏర్పాట్లను రాష్ట్ర బీసీ సంక్షేమ, రోడ్డు రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని భక్తులకు సూచించారు.

మానకొండూర్: ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేల సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

నిమజ్జనం సజావుగా జరిగేలా చూడాలి : ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్ నియోజకవర్గంలో గణేష్ నిమజ్జనం సజావుగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కొత్తపల్లి మండలంలోని చింతకుంట కెనాల్ వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను మేయర్ వై సునీల్‌రావుతో కలిసి పరిశీలించారు. కెనాల్‌లో నీటి నిలువ తక్కువగా ఉండడంతో మరిన్ని విడుదల చేయాలని ఇంజినీరింగ్ అధికారికి సూచించారు. చింతకుంట కెనాల్‌తో పాటు కొత్తపల్లి చెరువు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే, కొత్తపల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజుతో కలిసి పరిశీలించారు. ఆయా చోట్ల మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డీపీవో రవీందర్, డీఎం హెచ్‌వో సుజాత పాల్గొన్నారు.

నీతిమాలిన రాజకీయాలు మానుకోవాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 15 : కాంగ్రెస్ నాయకులు నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని, ఈ పద్ధతి మానుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హితవుపలికారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓ వైపు సీఎం, మంత్రులు అరికెపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అని, వారి వ్యక్తిగత విబేధాలు తమకేం సంబంధం లేదని మాట్లాడుతున్నారని, కానీ అరికెపూడి గాంధీ స్వయంగా సీఎం చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, కార్యకర్తలు, నాయకులను సంప్రదించాకే కాంగ్రెస్‌లో చేరానని గాంధీనే స్వయంగా చెప్పడం ప్రజలందరూ చూశారని తెలిపారు. ఇప్పుడేమో తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని బుకాయిస్తున్నారని, పదవి కోసం ఇంత దిగజారుడు రాజకీయం చేస్తారా? అని నిలదీశారు. సీఎం, మంత్రులకు ధైర్యం ఉంటే అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరడం వల్లే ఆయనకు పీఏసీ చైర్మన్ ఇచ్చామని చెప్పాలని సవాల్ విసిరారు. ఆ ధైర్యం కాంగ్రెస్ నాయకులకు లేదని దుయ్యబట్టారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాటల్లో తప్పు ఏముందని ప్రశ్నించారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుడు, సీఎంకు, కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. మనుషులతోపాటు దేవుళ్లను కూడా కాంగ్రెస్ పార్టీ వంచిస్తున్నదని విమర్శించారు. అరికెపూడి గాంధీ నిజంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే ఆయన మెడలో గులాబీ కండువా వేసుకోవాలని సూచించారు. సిగ్గూ, లజ్జ లేకుండా అరికెపూడి గాంధీ హైదరాబాద్‌లోని కౌశిక్ రెడ్డి ఇంటిపై అనుచరులతో దాడి చేసి, ఆ ప్రాంతంలో ఉన్న కుటుంబాల వారందరినీ భయభ్రాంతులకు గురి చేశారని, ఆస్తి నష్టం చేయడమే కాకుండా కౌశిక్‌రెడ్డిపై హత్యా ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటన సమయంలో పోలీసులు ఏం చేస్తున్నారని, డీజీపీ ఏం చేస్తున్నారని, గుడ్డి గుర్రాలకు పళ్ళు తోముతున్నారా? అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ కార్యకర్తలను గేట్ దగ్గర ఆపి, కొట్టండి అని కాంగ్రెస్ కార్యకర్తలను విచ్చలవిడిగా వదిలేస్తారా? అని ప్రశ్నించారు. దీని వెనుక కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహం లేదా? అని, ఇదంతా ముఖ్యమంత్రి కనుసన్నల్లో జరగలేదా? అని నిలదీశారు. ఎన్నికల ముందు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు మళ్లీ అబద్ధాలు ఆడుతున్నారని, ఇంత దారుణమైన పరిస్థితి ఎన్నడు కూడా రాజకీయాల్లో చూడలేదన్నారు.



దూసుకొచ్చిన మృత్యువు

బైండ్ల లచ్చన్న (ఫైల్)

శ్రీనిధి (ఫైల్)

- పొలాసలో ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు బైకులను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- నిమజ్జన వేడుకల కోసం వెళ్తున్న తాతా, మనుమరాలు దుర్మరణం
- మనుమడికి, మరో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు
- దవాఖానకు తరలింపు

మృత్యువు దూసుకొచ్చింది. అతివేగం ఆయువు తీసింది. ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్ నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నది. నిమజ్జన వేడుకల కోసం బైక్‌పై వెళ్తున్న తాతా, మనుమరాలికి అదే చివరి ప్రయాణమైంది. ఆదివారం వీరు ప్రయాణిస్తున్న బైక్‌తోపాటు మరో బైక్‌ను పొలాస వద్ద అతివేగంగా ఢీకొట్టగా, తాతా, మనుమరాలు అక్కడికక్కడే దుర్మరణం చెందడం కలిచివేసింది. మనుమడితో పాటు మరో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ఘటన జరిగిన తీరును చూసి ప్రతి ఒక్కరూ చలించిపోయారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించగా, మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

తీవ్రంగా గాయపడిన మల్లికార్జున్

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 15: నిమజ్జన వేడుకల కోసం వెళ్తున్న తాతా, మనుమరాలికి అదే చివరి ప్రయాణమైంది. ఆదివారం వీరు ప్రయాణిస్తున్న బైక్‌తోపాటు మరో బైక్‌ను జగిత్యాల జిల్లా పొలాస జంక్షన్ వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టగా, తాతా, మనుమరాలు అక్కడికక్కడే మృతిచెందగా, మనుమడితోపాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం అల్లీపూర్‌కు చెందిన బైండ్ల లచ్చన్న (55) ఆదివారం ధర్మపురిలోని తన కూతురు నారవేని మమత ఇంటికి వెళ్లాడు. సోమవారం అల్లీపూర్‌లో వినాయక నిమజ్జన వేడుకలు ఉండడంతో మనుమరాలు శ్రీనిధి(13), మనుమడు మల్లికార్జున్‌ను తీసుకొని బైక్‌పై అల్లీపూర్‌కు బయలుదేరాడు. అయితే పొలాస జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు ధర్మపురి వైపు వెళ్తూ ప్రయాణికులను దింపడానికి ఆగింది. అదే సమయంలో కొండగట్టు నుంచి ధర్మపురి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు (టీఎస్21యుడి9955) ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో జగిత్యాల నుంచి పొలాస వైపు వస్తున్న హోండా ఆక్టీవా బైక్‌ను ఢీకొట్టడంతో పాటు లచ్చన్న ప్రయాణిస్తున్న బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లచ్చన్న, మనుమరాలు శ్రీనిధి అక్కడికక్కడే మృతి చెందారు. మల్లికార్జున్ తీవ్రంగా గాయపడ్డాడు. హోండా ఆక్టీవా బైక్ మీద ప్రయాణిస్తున్న పొలాసకు చెందిన బదినేపల్లి నర్సయ్య, బూర్ల రాజన్న తీవ్రంగా గాయపడ్డారు. కాగా, ప్రమాద ఘటనలో ప్రైవేట్ బస్సు బైక్‌తో సహా తాతా, మనుమడిని సుమారు 150 మీటర్లు ఈడ్చుకొని వెళ్లి ఆగింది. సంఘటనా స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ క్రిష్ణారెడ్డి, ఎస్ఐ సదాకర్ ఘటన స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులను జగిత్యాల జిల్లా దవాఖానకు తరలించారు. లచ్చన్న కూతురు నారవేని మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాట విడుదల చేస్తున్న అతిథులు, పూర్వ విద్యార్థులు

డాక్టర్ ముత్యంకు ఘన నివాళి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 15 : శాతవాహన యూనివర్సిటీ విశ్రాంత తెలుగు ప్రొఫెసర్, రచయిత డాక్టర్ కే ముత్యం సంస్మరణ సభ సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు విభాగం ప్రస్తుత, పూర్వ విద్యార్థులు సంయుక్తంగా నిర్వహించగా, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మహ్మద్ జాఫర్ సభాధ్యక్షత వహించారు. ఎస్యూ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వినాయకరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, తుల రాజేందర్, ఉప రిజిస్ట్రార్ వై కిశోర్, ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ మనోహర్, అన్నవరం దేవేందర్ పాల్గొన్నారు. అనంతరం, ముత్యం పేరుతో పాటను విడుదల చేశారు.

గంభీరావుపేట-లింగన్నపేట మానేరు వాగుపై తెగిన రోడ్డు

రోడ్డు తెగింది.. ప్రయాణం ఆగింది

గంభీరావుపేట మండలంలోని గంభీరావుపేట-లింగన్నపేట మధ్య గల మానేరు వాగుపై రోడ్డు ఇటీవలి వరదలకు కొట్టుకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు పూర్తిగా కోతకు గురికావడంతో పైపులు తేలాయి. కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెగిన రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేసి తమ కష్టాలను తీర్చాలని ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. - గంభీరావుపేట, సెప్టెంబర్ 15

అవార్డు గ్రహీతకు హార్దిక శుభాకాంక్షలు
శ్రీ (NRI) దొంతుల లవన్, వేములవాడ
వేములవాడలో కొబ్బరికాయలు అమ్ముకునే శ్రీ దొంతుల క్రి